

## స్నేహం ఓ దివ్య ఔషధం

8లో

రేపు (ఆగస్టు 4) స్నేహితుల దినోత్సవం

వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 342 శనివారం | 03 ఆగస్టు 2024 | పేజీలు : 08 | వెల రూ. 5




2లో..

## 256 కిలోలు గంజాయి స్వాధీనం

ఇద్దరు అంతర్ రాష్ట్ర ముఠా సభ్యుల అరెస్ట్



8లో..

## అభివృద్ధే మా ఎజెండా

ఎంపీ డాక్టర్ కడియం కావ్య

భూపాలపల్లిలో పలు పనులకు శంకుస్థాపన




## ఆర్వోఆర్‌పై 23న అభిప్రాయాల సమర్పణ

సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్

పాల్గొన్న వివిధ జిల్లాల కలెక్టర్లు

హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్

# ఆక్రమణలపై నో కాంప్రమైజ్



వివరాలు 2లో..

హైకోర్ట్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం




- మొన్న భద్రకాళి చెరువు ఎఫ్‌టీఎల్
- నేడు కోట చెరువు, బంధం చెరువు, చిన్నవడ్డేపల్లి చెరువులో నిర్మాణాల తొలగింపు
- బుల్డోజర్ల సాయంతో నిమిషాల్లో నేలమట్టం
- బడాబాబుల వైపు కన్నెత్తి చూడడంలేదన్న ఆరోపణలు

పట్టణ ప్రాంతాల్లో రోజు రోజుకూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కావాల్సినంత భూమి లేకపోవడంతో రియల్టర్లు కుంటలు, చెరువుల కబ్జాకు తెగబడ్డారు. వారికి రాజకీయ నాయకుల అండదండలు మెండుగా ఉండడంతో ఇష్టారాజ్యంగా ఆక్రమణలకు పాల్పడ్డారు. తాగు, సాగు నీటికి ఉపయోగపడుతున్న కుంటలు, చెరువులను పల్లీలు, బఠానీలు అమ్ముకున్నట్లు ప్లాట్లుగా చేసి విక్రయించారు. ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) పరిధిలో ఎలాంటి శాశ్వత నిర్మాణాలు చేయకూడదన్న నిబంధనను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా పెద్ద పెద్ద భవంతులు నిర్మించారు. దీనిపై ఇటీవల హైకోర్ట్ సీరియస్ అయింది. ఎఫ్‌టీఎల్ పరిధిలోని నిర్మాణాలను తక్షణమే తొలగించాలంటూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో స్పందించిన ప్రభుత్వం ఈ బాధ్యతలను లేక్ ప్రొటెక్షన్ కమిటీ నుంచి తప్పించి అదనపు కలెక్టర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్‌నకు అప్పగించారు. వారం రోజుల క్రితం భద్రకాళి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా నిర్మించిన 28 ఏసీ షెడ్లు, 78 ప్రహరీలను తొలగించారు. శనివారం కోట చెరువు, బంధం చెరువు, చిన్నవడ్డేపల్లి చెరువుల్లోని ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. దీంతో చెరువులు, కుంటల రక్షణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్న భావాన్ని ప్రజలకు కల్పిస్తోంది. - వరంగల్ వాయిస్, వరంగల్

# ఆక్రమణలపై నో కాంప్రమైజ్



**హైకోర్ట్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం**

**మొన్న భద్రకాళి చెరువు ఎఫ్‌టీఎల్**

**నేడు ఉదయం కోట చెరువు, బంధం చెరువు, చిన్నవడ్డేపల్లి చెరువులో నిర్మాణాల తొలగింపు**

**బుల్డోజర్ల సాయంతో నిమిషాల్లో నేలమట్టం**

**బడాబాబుల వైపు కన్నెత్తి చూడడంలేదన్న ఆరోపణలు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** గొలుసు కట్టు చెరువులకు కేంద్రమైన ఓరుగల్లులో నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. నగర పరిధిలో 50కి పైగా ఉన్న కుంటలు, అనేక కాలువలు కబ్జా దారుల చేతిలో పడి కనిపించకుండా పోయాయి. పలు కుంటలు మురుగు నీరు ప్రవహించే కాలువలుగా మారాయి. అనేక చెరువులు కుచించుకుపోయాయి. వందల ఎకరాల్లో విస్తరించిన చెరువులు నేడు సగానికి పైగా కబ్జాకు గురికావడంతో అరకొరగా కనిపిస్తున్నాయి. ఇక్కడి గొలుసుకట్టు చెరువు భూముల విస్తీర్ణంతోపాటు శిఖం, ఎఫ్ టీఎల్, బఫర్ జోన్ లను రెవెన్యూ సర్వే, ల్యాండ్ రికార్డ్స్ అధికారులు గతంలోనే గుర్తించారు. కానీ చెరువు భూముల ఆక్రమణను మాత్రం అడ్డుకోలేక పోయారు. రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు కబ్జా దారులతో అంటకాగడంతో చెరువులకు రక్షణ లేకుండా పోయింది. ఎవరు ఎంత ఆక్రమిస్తే అంత అన్న చందంగా ఇష్టానుసారంగా ఆక్రమించి ప్లాట్లుగా చేసి విక్రయించారు.

## 1100 అక్రమ నిర్మాణాలు..

హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో గ్రేటర్ వరంగల్ కమిషనర్ ఇటీవల రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, పోలీస్ శాఖలకు చెందిన అధికారులతో సమావేశం నిర్వహించారు. హనుమకొండ, వరంగల్ పరిధిలోని చెరువుల్లో ఆక్రమణలను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు ప్రత్యేకంగా టాస్క్ ఫోర్స్ ను రంగంలోకి దింపుతున్నారు. అయితే హనుమకొండ, వరంగల్ పరిధిలోని నాలుగు చెరువుల పరిధిలోనే 1100పైగా అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు గ్రేటర్ వరంగల్ అధికారులు గుర్తించారు. భద్రకాళి చెరుదువ పరిధిలో 249, బంధం చెరువు పరిధిలో 366, చిన్నవడ్డేపల్లి చెరువు పరిధిలో 329, కోట చెరువు పరిధిలో 150కి పైగా అక్రమ నిర్మాణాలు వెలిసినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. వీటితో పాటు నగరంలోని మిగిలిన చెరువుల పరిధిలో అక్రమంగా నిర్మించిన ఇండ్లను గుర్తించే పనిలో పడ్డారు.

## మొన్న భద్రకాళీ..

వారం రోజుల క్రితం సిటీ ప్లానర్ వెంకన్న సారథ్యంలో భద్రకాళి బండ్ సమీపంలోని ఎఫ్ టీఎల్ పరిధిలో అక్రమంగా నిర్మించిన పలు కట్టడాలను బుల్డోజర్ల సాయంతో నిమిషాల్లో నేలమట్టం చేశారు. జయ నర్సింగ్ కళాశాల నుంచి భద్రకాళి బండ్ వరకు, సంతోషిమాత కాలనీ నుంచి బొంది వాగు నాలా వరకు ఎఫ్ టీఎల్ పరిధిలో ఉన్న 28 ఏసీ షెడ్లు, 78 కాంపౌండ్ వాల్స్ ను తొలగించారు. తాజాగా జిల్లా టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో రెవెన్యూ, ఇరిగేషన్, టౌన్ ప్లానింగ్, పోలీసు అధికారులు శనివారం ఉదయం కోట చెరువు, బంధం చెరువు, చిన్నవడ్డేపల్లి చెరువు ఎఫ్ టీఎల్ పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించారు. బల్దియా సిటీ ప్లానర్ శైలజ సారథ్యంలో కోట చెరువు ఎఫ్ టీఎల్ పరిధిలో నాలుగు, చిన్న వడ్డేపల్లి చెరువు ప్రాంతంలో ఎనిమిది, బంధం చెరువు ఎఫ్ టీఎల్ లో పరిధిలోని ఏడు మొత్తం 19 ఏసీసీ షెడ్లు, కాంపౌండ్ వాల్స్ తొలగించారు.

## అటువైపు కన్నెత్తి చూడడంలేదు..

నగరంలోని వివిధ చెరువుల పరిధిలోని ఎఫ్ టీఎల్ లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను తొలగిస్తున్నామంటూ ప్రకటనలు చేస్తున్న బల్దియా అధికారులు బడా బవంతుల వైపు కన్నెత్తి కూడా చూడడంలేదన్న విమర్శలున్నాయి. నిరుపేదలు పైసా పైసా కూడబెట్టి కట్టుకున్న రేకుల షెడ్లు, ప్రహరీలను మాత్రమే కూల్చివేస్తూ గొప్పలు చెప్పుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. బల్దియా అధికారులకు చిత్తశుద్ధి ఉంటే ఎఫ్ టీఎల్ పరిధిలో నిర్మించిన భవంతులను సైతం కూల్చివేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. బడా భవంతుల యజమానుల నుంచి పెద్ద మొత్తంలో మామూళ్ల రూపంలో వసూలు చేసి పాలకవర్గం, అధికారులు పర్సంటేజీల వారీగా పంచుకున్నారని, అందుకే వారిపైపు కన్నెత్తి కూడా చూడడంలేదన్న విమర్శలను బల్దియా అధికారులు ఎదుర్కొంటున్నారు.








# 256 కిలోలు గంజాయి స్వాధీనం

**ఇద్దరు అంతర్ రాష్ట్ర ముఠా సభ్యుల అరెస్ట్**

**వరంగల్ వాయిస్, నర్సంపేట :** నర్సంపేటలో భారీ మొత్తంలో గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం సాయంత్రం నర్సంపేట పట్టణంలో పోలీసులు సాధారణ తనిఖీలు చేపట్టగా.. మల్లంపల్లి రోడ్డు కమలాపూరం క్రాస్ వద్ద రెండు కార్లలో భారీ మొత్తంలో తరలిస్తున్న గంజాయి లభించింది. స్మగ్లింగ్ కు పాల్పడుతున్న ఇద్దరు అంతర్ రాష్ట్ర గంజాయి మఠా సభ్యులను టాస్క్ ఫోర్స్, నర్సంపేట పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. వీరి నుంచి లక్షల విలువ కలిగిన 256 కిలోల గంజాయితో పాటు, రెండు కార్లు, మూడు సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో జైనోతూ బాబు కుమారస్వామి(30), గొర్లవీడు ఉండ భూపాలపల్లి జిల్లా, నన్నూరి కుమారస్వామి, నెరడుపల్లి, భూపాలపల్లి జిల్లా ప్రస్తుతం మరో ముగ్గురు నిందితులు జలెందర్ నివాసం మహబూబాబాద్, అంగోతు రాజేందర్ నివాసం భూపాలపల్లి జిల్లా, ముకుంది నివాసం డొంకరాయి తూర్పుగోదావరి జిల్లా ప్రస్తుతం పరారీలో ఉన్నారు. ఈ అరెస్టుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ పూర్తి వివరాలను వెల్లడిస్తూ పోలీసులు అరెస్టు చేసిన నిందితులు బానోతూ బాబు కుమారస్వామి, నన్నూరి కుమారస్వామికారు డ్రైవర్ గా జీవనం కొనసాగిస్తుండగా మిగితా నిందితులతో పరిచయం కాస్త స్నేహంగా మారింది. వీరందరూ సులభంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంగా గత కొద్ది రోజులుగా ఆంధ్రప్రదేశ్ లోని డొంకరాయి పరిసర ప్రాంతాల నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు రహస్యంగా తరలించి గంజాయిని ఎక్కువ ధరకు విక్రయించేవారు. ఇదే తరహాలో డొంకరాయి లోని ముకుంద్ తో పరిచయం ఏర్పడి మిగితా నిందితులతో కలసి డొంకరాయి గ్రామంలో 256 కిలోల గంజాయిని కోనుగోలు చేసి దానిని రెండుకిలోల చొప్పున 128 ప్యాకెట్లలో ప్యాక్ చేసి కారులలో ఎవరికి అనుమానం రాకుండా భద్రపరచి, డొంకరాయి నుంచి భద్రాచలం, మహబూబాబాద్ మీదుగా నర్సంపేటకు నిందితులు కారులో గంజాయిని తరలిస్తున్నట్లుగా పోలీసులకు అందిన పక్కా సమచారంతో శనివారం ఉదయం టాస్క్ ఫోర్స్, నర్సంపేట పోలీసులు తమ పరిధిలో కమలాపురం క్రాస్ రోడ్డు నర్సంపేట దగ్గర వాహన తనిఖీలు నిర్వహించారు. దీంతో పోలీసులను గుర్తించిన నిందితులు కారులో తప్పించుకుని పారిపోయే క్రమంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు అప్రమత్తమై వెంటనే నిందితుల కార్లను అడ్డగించి తనిఖీ చేయగా కారులలో గంజాయి ప్యాకెట్లు లభించాయి. నిందితులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. పోలీసులు అరెస్టు చేసిన నిందితులలో బానోతు బాబు కుమారస్వామి, జలెందర్ గతంలో కూడా ఇలాగే గంజాయి స్మగ్లింగ్ చేస్తుండగా పట్టుబడి కేసులు కూడా నమోదు కాబడ్డాయి. ఈ ముఠా సభ్యులను అరెస్టు, గంజాయిని స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కనబరిచిన టాస్క్ ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, నర్సంపేట ఏసీపీ కిరణ్ కుమార్, టాస్క్ ఫోర్స్ ఇన్ స్పెక్టర్ సార్లరాజు, నర్సంపేట ఇన్ స్పెక్టర్ రమణమూర్తి, టాస్క్ ఫోర్స్ ఆర్ఎస్ఐలు శరత్ కుమార్, భాను ప్రకాష్, ఖానాపూర్ ఎస్ హెచ్ బీ రఘుపతి, ఏఏఓ సల్మాన్ పాషా, టాస్క్ ఫోర్స్ హెడ్ కానిస్టేబుళ్లు అశోక్, కానిస్టేబుళ్లు సురేష్, మహబూబ్ పాషా, నేరెళ్ల సాంబరాజు, రాజేష్, శ్రీనివాస్, సురేందర్, శ్రవణ్ కుమార్, నాగరాజు, నర్సంపేట పోలీసు సిబ్బందిని పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ అభినందించారు.

# ఆర్వోఆర్‌పై 23న అభిప్రాయాల సమర్పణ

**సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్**

**పాల్గొన్న వివిధ జిల్లాల కలెక్టర్లు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న నూతన ఆర్వోఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై అభిప్రాయాలను ఈ నెల 23 వరకు సమర్పించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. శనివారం సీసీఎల్ఏ ప్రధాన కార్యాలయం నుంచి వరంగల్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, పెద్దపల్లి, ఆసిఫాబాద్, నారాయణపేట, ములుగు, ఆదిలాబాద్, జనగామ, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల కలెక్టర్లతో పెండింగ్ భూ సమస్యల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రివ్యూ నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకు పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై జిల్లాల వారీగా అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ చేసిన తర్వాత సంబంధిత దరఖాస్తులను ఆన్ లైన్ లో అప్ డేట్ చేసి పరిష్కరించాలని సూచించారు. రాష్ట్రంలో ఉన్న పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, నూతన ఆర్వోఆర్ చట్టం ముసాయిదా బిల్లును రూపొందించి ప్రజలకు అందుబాటులో పెట్టిందని అన్నారు. నూతన చట్టం ముసాయిదా కింద సెక్షన్ 4 ప్రకారం కొత్త ఆర్వోఆర్ రికార్డ్ రూపకల్పన, అందుబాటులో ఉన్న రికార్డ్ సవరణకు అవకాశం ఉందని, గత చట్టం కింద నిలిచిపోయిన సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి సెక్షన్ 6 వెసులుబాటు కల్పించిందని, సీసీఎల్ఏ వెబ్ సైట్ నందు ముసాయిదా బిల్లు అందుబాటులో ఉందన్నారు. ఆర్వోఆర్ ముసాయిదా బిల్లుపై ప్రజలు తమ సలహాలు సందేహాలు, అభిప్రాయాలను సీసీఎల్ఏ వెబ్ సైట్ www.ccla.telangana.gov.in ద్వారా లేదా ror-rev@telangana.gov.in మెయిల్ ద్వారా అగస్టు 23 వరకు తెలియజేయాలని ఆయన కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్డీఓ కృష్ణవేణి, కాలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీకాంత్, పర్యవేక్షకులు విశ్వ నారాయణ,రమేష్, చంద్రశేఖర్, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పొదుపు.. జీవితానికి వెలుగు



**వరంగల్ వాయిస్, ఐనవోలు :** పొదుపే మధ్యతరగతి జీవితాల్లో వెలుగులు నింపుతుందని ముల్కలగూడెం శ్రీ ఆంజనేయ పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడు నాయిని అనిల్ యాదవ్ అన్నారు. శనివారం సంఘంలో సభ్యుడైనా మినుముల వెంకటయ్య మరణించగా వారి నామినికి బీమా డబ్బులు రూ.70 వేలు సంఘం పాలకవర్గ సభ్యులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ సంఘంలో సభ్యత్వం తీసుకోవాలన్నారు. మనం చేసే చిన్న పొదుపు వృద్ధాప్యంలో పెద్ద బాసటగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కొండపర్తి శ్రీ ప్రతాపరుద్ర పొదుపు సమితి అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు కుమార్, అనిల్, అప్సర్, శ్రీనివాస్, రజాక్, రవీందర్ రెడ్డి, రఘుపతి, కోటి, రషీద్ పాల్గొన్నారు.

## ఏఐఎస్ఎఫ్ పాఠశాల సర్వే



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఏఐఎస్ఎఫ్, జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి ప్రణీత్ గౌడ్ పాఠశాలను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, బాలసముద్రం, హనుమకొండ మండల కేంద్రంలో ఉన్న హైస్కూల్ లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో తరగతి గదులలో వర్షపు నీరు కురవడం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని బిల్డింగ్ వాటర్ ప్రూఫ్ చేయాలన్నారు. పాఠశాల ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, అన్ని వస్తువులతో ఫర్నిచర్ ప్రొజెక్టర్ సౌండ్స్ ఏర్పాటు చేయాలని, గ్రౌండ్ సదుపాయం కల్పించాలని, ఈ పాఠశాల సమస్యలతోపాటు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో హనుమకొండ (ఎంఈఓ) మండల విద్యాధికారి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల చరణ్, కుక్కలు కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి కాసరబోయిన రవితేజ, జిల్లా సమితి సభలు కుశాల్, శివ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు ఇక్కట్లే..!

### పాలకుర్తిలో యూరియా కొరత



**వరంగల్ వాయిస్, పాలకుర్తి :** కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. పాలకుర్తి రైతు సేవ సహకార సంఘంలో నిల్వలు ఉన్న అధికారులు ఇవ్వడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఉదయం నుంచి పడిగాపులు కాస్తున్న ఇప్పటి వరకు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్పు వచ్చిందంటే మళ్లీ పాత రోజులే గుర్తుకు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో యూరియా కోసం రైతులు ప్రైవేట్ దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. బస్తాలు దొరక్క ఇబ్బంది పడుతున్నారు. కేవలం అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికి మాత్రమే ఇచ్చే విధంగా రహస్యంగా టొకెన్లను ఇస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వరి నాట్లు అనంతరం యూరియా వాడకం అవసరం. అందుబాటులో లేక చాలా మంది నాట్లు వేసేందుకు వెనుకడుగు వేస్తున్నట్లు అన్నదాతలు చెబుతున్నారు. ఆరుగాలం శ్రమించే రైతులకు అన్నీ కష్టాలే. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ ఊదరగొడుతున్నా క్షేత్రస్థాయిలో వీరి ఇబ్బందులు పట్టడం లేదని పెదవి విరుస్తున్నారు. అధికారుల ప్రకటనలకు.. క్షేత్రస్థాయికి పొంతన కరవైందని, అసలు రైతు సేవ సహకార సంఘంలో యూరియా నిల్వలు ఉన్నట్లా..! లేనట్లా..? అని ప్రశ్నిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి స్పందించి పార్టీలకతీతంగా రైతులందరికి యూరియా బస్తాలు ఇప్పించేలా చొరవ తీసుకోవాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

# కేరళ వరద బాధితులను ఆదుకుందాం




### సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పిలుపు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రకృతి విలయంతో తీవ్రంగా నష్టపోయిన కేరళ వరద బాధితులను మానవతా దృక్పథంతో ఆదుకోవాలని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి కోరారు. శనివారం హనుమకొండ చౌరస్తాలో కేరళ వరద బాధితుల సహాయార్థం సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం సీపీఐ నాయకులు హనుమకొండ చౌరస్తా నుండి టైలర్ స్ట్రీట్, కుమార్ పల్లి నుండి అశోకా జంక్షన్ వరకు షాపుల వద్దకు వెళ్ళి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి మాట్లాడుతూ కేరళలో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రకృతి బీభత్సం సృష్టించిందని, వందలాది మంది మృతి చెందారని, వేలాది మంది నిరాశ్రయులయ్యారని అన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ స్పందించి మానవతా దృక్పథంతో ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా కేరళలలో జరిగిన ప్రకృతి విలయతాండవాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి ప్రజలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, మండల కార్యదర్శి ఏశబోయిన శ్రీనివాస్ , నాయకులు వేల్పుల సారంగపాణి, కొట్టెపాక రవి, రమేష్ దేవా, కొట్టె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ టీచర్లపై సీఎం వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాల్ బహదూర్ స్టేడియంలో జరిగిన ప్రభుత్వ ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ప్రైవేట్ ఉపాధ్యాయులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. రేవంత్ రెడ్డి అవగాహన రాహిత్యంతో, విషయ పరిజ్ఞానం లేకుండా , బాధ్యతారహితంగా ప్రైవేటు ఉపాధ్యాయులను ఇంటర్, డిగ్రీ ఫెయిల్ అయిన వాళ్లని, వాళ్లకు మీ కంటే తక్కువ తెలివి ఉన్న వాళ్లని" అంటూ చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని టీపీటీఎఫ్ డిమాండ్ చేసింది. ముఖ్యమంత్రి చేసిన ప్రతి వ్యాఖ్యకు సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు చంద్రగిరి సునిల్ కుమార్ అన్నారు. ఎందుకంటే వాళ్లు అర్హతతో, అనుభవంతో, ప్రతిభతో, నిబద్ధతతో చాలీచాలని జీతాలతో విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమించే విద్యాశ్రామికులని తెలిపారు. మీరు ప్రభుత్వ ఉపాధ్యాయులను పొగడాలనుకోవడంలో తప్పు లేదు కానీ, వారి మెప్పు కోసం ప్రైవేటు ఉపాధ్యాయులను కించపరచడం సబబు కాదన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయు ఆత్మీయ సభలో ప్రైవేట్ టీచర్ల మీద రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తక్షణమే ఉపసహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్కూల్ షూల పంపిణీ




**వరంగల్ వాయిస్, వరంగల్ :** బీఎస్ ఎన్ఎల్ సంస్థ నుంచి పదవీ విరమణ పొందిన నాళ్ల సోమనాథం వారి కుమారుడైన వివేక్ ఏవీవీ పాఠశాల నుంచి 1993 వ సంవత్సరం పదవ తరగతి పరీక్షలలో ప్రథమ స్థానంలో నిలిచి (ఎస్సెస్సీ1993 బ్యాచ్ స్కూల్ టాపర్ ) ప్రస్తుతం ఒక ప్రముఖ సాఫ్ట్ వేర్ సంస్థలో సాఫ్ట్ వేర్ ఇంజినీర్ గా పనిచేస్తున్నందున ఈ సంస్థపై గల అభిమానంతో పాఠశాల విద్యార్థులకు సుమారు రూ.15,000 ల విలువ చేసే స్కూల్ షూలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత సోమనాథం మాట్లాడుతూ ఏవీవీ పాఠశాల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పాఠశాల విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి కోసం శ్రమిస్తున్న సంస్థ యాజమాన్యాన్ని, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ప్రిన్సిపాల్ డా.ఎ.భుజేందర్ రెడ్డి మాట్గాడుతూ దాత దాతృత్వానికి ధన్యవాదాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం ఎ.సంధ్యారాణి, ఎన్. నవీన్, యం.వాసంతి, వి.రమాదేవి, జి.వీరేశలింగం, చిలుక భాస్కర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బీఎన్ఆర్కేఎస్ మండల నూతన కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, ఐనవోలు :** బీఎన్ ఆర్ కేఎస్ (భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం) ఐనవోలు మల్లికార్జున స్వామి వారి దేవస్థానం ఆవరణలో శనివారం ఐనవోలు మండల పరిధిలోని గ్రామాల్లో నుంచి భవన నిర్మాణ కార్మికులందరూ కలిసి వచ్చి మండల సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమావేశం బీఎన్ ఆర్ కేఎస్ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి నర్రా నరేందర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిలుగా ఎస్ కే అలీ, బీఎన్ ఆర్ కేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, పంకెర్ల కుమారస్వామి యాదవ్ బీఎన్ ఆర్ కేఎస్ రాష్ట్ర కార్యదర్శి, హనుమకొండ జిల్లా ఇంఛార్జి, టీఎఫ్ టీయూ (తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్) హనుమకొండ జిల్లా అధ్యక్షులు హాజరై వారు ఇరువురు కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ సంఘం చేసిన పోరాటాల ఫలితంగా వచ్చిన విజయాలను వివరించారు. అలాగే భవిష్యత్తు దిశానిర్దేశం కార్మికులకు సూచించారు. అనంతరం ఐనవోలు మండల నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా మూలవీర నర్సింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి, నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్న కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కమిటీ మన సంఘం నిబంధనలకు కట్టుబడి ఉండాలని, కార్మికుల కోసం నిరంతరం కృషి చేయాలని, ప్రతి నెలా 20న మండల కమిటీ సమావేశం ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి సంవత్సరం సంఘం సభ్యులు, కార్మికులు సభ్యత్వం తప్పకుండా తీసుకోవాలన్నారు. అలాగే మన బీఎన్ ఆర్ కేఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కామల్ల ఐలన్నా ఏ పిలుపునిచ్చినా ముందు వరుసలో ఉండి పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. మన వేల్ఫర్ బోర్డును కాపాడుకోవాలని, దొంగ లేబర్ కార్డులను ఇప్పించే వారిని పట్టుకోవాలని, దొంగ లేబర్ కార్డులను తొలగించేంత వరుకు పోరాటం చేయాలన్నారు. ఐనవోలు మండల కమిటీ ఎన్నికైన వారిలో అధ్యక్షుడు మొటక సత్తయ్య, ఉపాధ్యక్షులు నీరటి కుమారస్వామి, ఎండీ పాషా, జున్ను సారయ్య, ప్రధాన కార్యదర్శి ఇండ్ల కృష్ణ, కార్యదర్శులు కట్కూరి చంద్రమౌళి, ముంజ మల్లేశం, జిట్టబోయిన ప్రభాకర్, ప్రచార కార్యదర్శిలు, లింగాల లక్ష్మణ్, కాయిత రాజు, కోశాధికారి గుండె శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు పిట్టలసాంబయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భవన నిర్మాణ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
శనివారం 03, ఆగస్టు 2024
www.warangalvoice.net

# డిమాండ్ల సాధనకు బీసీలు ఐక్యంగా పోరాడాలి

## తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, కరీంనగర్ :** సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా అన్ని రంగాలలో వెనకకు నెట్టి వేయబడిన బీసీలు డిమాండ్ల సాధన కోసం పోరాడాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్ బద్దం ఎల్లారెడ్డి భవన్ లో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు కటికిరెడ్డి బుచ్చన్న యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వెంకట్రాములు ప్రసంగిస్తూ చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల బిల్లు పార్లమెంట్ లో ప్రవేశపెట్టి ఆమోదించాలన్నారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, దేశ కుల గణనలో బీసీ కుల గణన చేయాలని డిమాండ్ చేశారు .కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ అమలు జరపాలని బీసీలకు 20వేల కోట్లు కేటాయించి అభివృద్ధికి సంక్షేమానికి చర్యలు చేపట్టాలని, యుద్ధప్రాతిపదికన కుల గణన జరిపి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచి స్థానిక ఎన్నికలు జరపాలన్నారు. చేనేత రుణాలు మాఫీ చేయాలని, కార్మికులకు చేతినిండా పనులు కలిగించి ఆత్మహత్యలను నివారించాలని, గొల్ల కురుమలకు గొర్రెల పంపిణీ బదులు నగదు బదిలీ సొసైటీల ద్వారా చెల్లించాలని, గీత, మత్స్య, రజక మొదలైన వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆగస్టు 12న "బీసీ డిమాండ్స్ డే " పాటించి జిల్లా అధికారులకు వినతిపత్రాలు ఇవ్వాలన్నారు. ఆగస్టు 31న హైదరాబాద్ లో జరుగు రాష్ట్ర సదస్సు జయప్రదం చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి జంగ కొమురయ్య యాదవ్, వీసం మల్లేశం యాదవ్, గుంటిరాజు, పిట్టల నరసయ్య, జి.మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమాచారం వెంటనే అందించేలా ప్రభుత్వ శాఖలను ఆదేశించండి

## సీఎం రేవంత్ రెడ్డిని కోరిన బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ బీసీ కమిషన్ వివిధ అధ్యయనాల్లో భాగంగా కోరే సమాచారాన్ని, వివరాలను వెంటనే అందించి, సహకరించేలా ఆయా ప్రభుత్వ విభాగాలకు, జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రాత్రి అసెంబ్లీలో ముఖ్యమంత్రిని కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేసినట్లు, పలు పత్రాలు అందజేసినట్లు డాక్టర్ వకుళాభరణం తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను నిర్ణయించడానికి గాను, అలాగే ప్రభుత్వం ఇచ్చిన టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్ మేరకు ఆయా ప్రభుత్వ విభాగాలను సమాచారం ఇవ్వాలని బీసీ కమిషన్ ఎప్పటికప్పుడు లేఖలను రాయడం జరుగుతుంది. త్వరగా కమిషన్ కు వివరాలు అందినట్లైతే నివేదికలను సకాలంలో అందజేయడానికి వీలుంటుంది. ఇదిలా ఉండగా ప్రస్తుతం లోకల్ బాడీ ఎన్నికలను వీలైనంత త్వరగా నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఈ నేపథ్యంలో ఇటీవల ముఖ్యమంత్రి అధ్యక్షతన సచివాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ అంశంపై అధికారులు, బీసీ కమిషన్ చైర్మన్ తో రెండు సార్లు సమావేశం నిర్వహించారు. త్వరగా కార్యచరణ ప్రణాళికలను ప్రభుత్వానికి అందజేయాలని కోరారు. ఈ దిశగా శుక్రవారం డాక్టర్ వకుళాభరణం కమిషన్ చేస్తున్న అధ్యయనం, తదితర అంశాలను ముఖ్యమంత్రిని కలిసి లిఖిత పూర్వకంగా పత్రాలను అందజేసినట్లు తెలిపారు.

# స్వచ్ఛదనం-పచ్చదనంతో అభివృద్ధి

## కార్పొరేటర్ మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో డివిజన్ లోని ప్రజలందరూ స్వచ్ఛందంగా హాజరై విజయవంతం చేయాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. శనివారం డివిజన్ లోని సీఆర్సీ భవన్ లో డివిజన్ ఇంచార్జి శానిటరీ ఇన్ స్పెక్టర్ వెంకన్న అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ మరుపల్ల రవి హాజరయ్యారు. ఆ సందర్భంగా మరుపల్ల రవి మాట్లాడుతూ ఈనెల 5 నుంచి 9 వరకు జరుగు ప్రభుత్వం తలపెట్టిన కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములైనచో డివిజన్ కొంత మేరకు అభివృద్ధికి నోచుకుంటుందన్నారు. ఆర్పీలు, అంగన్వాడి టీచర్లు, స్వచ్ఛంద సంఘాలు ప్రజలను భాగస్వామ్యం చేయడానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో మలేరియా సూపర్ వైజర్ మధుకర్, కరీమాబాద్ అంగన్వాడీ సెక్టార్ సూపర్ వైజర్ మాధవి, అర్టికల్చర్ అసిస్టెంట్ అనూహ, వార్డు ఆఫీసర్ ఎన్.శంకర్, ఏఎన్ఎం మచ్చ అనిత, జవాన్ ప్రశాంత్, ఆర్పీలు, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అన్నదానం



**వరంగల్ వాయిస్, నడికూడ :** షెడ్యూల్ కులాల వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు శనివారం పులిగిల్ల గ్రామంలో స్వీట్స్, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నడికూడ మండల ఇంచార్జి ఏకుశంకర్ మాదిగ, పులిగిల్ల ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం సందర్భంగా వారు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30 ఏళ్లుగా చేస్తున్న ఉద్యమానికి వర్గీకరణ పట్ల సానుకూల తీర్పు వెలువడడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. పులిగిల్ల గ్రామానికి చెందిన ఇనుగాల సదానందం, దండోర ఉద్యమం పట్ల ఉన్న ప్రేమాభిమానాలకు ప్రతీకగా 150మంది గ్రామస్తులకు అన్నదానం చేశారు . ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నడికూడ మండల కన్వీనర్ సంఘాల సుమన్, మండల నాయకులు రామంచ రాజేందర్, నడికూడ గ్రామ శాఖ అధికార ప్రతినిధి అఖిల్, అనిల్, వరికోలు గ్రామ శాఖ అధ్యక్షుడు రామంచ నరేష్, ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోడెపాక నరేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# అవయవదాన దినోత్సవ బ్యానర్ ఆవిష్కరణ




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జాతీయ అవయవ దాన దినోత్సవం సందర్భంగా శనివారం హనుమకొండ జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో "జాతీయ అవయవదాన దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. భారతదేశంలో మొదటగా గుండె మార్పిడి చికిత్స 1994 ఆగస్టు 3న జరిగింది. ఈరోజు నుంచి భారత దేశంలో జాతీయ అవయవదాన దినోత్సవం జరుపుతూ వస్తున్నారు. " అవయవ దానం ప్రాణదానం " జీవన్ మృతుడు ఆయిన సందర్భంలో అవయవ దానం చేస్తుంటారు. దేశంలో అనేక వేల మంది అవయవలేమితో జీవిస్తున్నారు. అభాగ్యులను రక్షించడానికి అవయవ దానం ఎంతో అవసరమన్నారు. అవయవ దానం దైవ కార్యం లాంటిదని, ఒక్క అవయవ దాత 8 మందికి ( ప్రాణం పోస్తాడు) అవయవ దానం చేస్తారు. కాబట్టి. అందరం అవయవదానంపై అవగాహన కలిగి ఉండి, మరణ అనంతరం నేత్ర, శరీర, అవయవ దానం చేసి మానవ మనుగడకు తోడ్పడుదామని జాయింట్ కలెక్టర్ వెంక రెడ్డి అన్నారు. నేత్ర దానాలు 300 పైగాను, 122 శరీర దాన కార్యక్రమాలు, అవయవ దాన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న అసోసియేషన్ సభ్యులను అభినందించారు. తరువాత ప్రజా కవి కాళోజి తొలి దేహదానం చేసిన స్ఫూర్తిదాత, వారి విగ్రహం వద్ద అవయవదాన దినోత్సవ ప్రాముఖ్యతను వివరించి ప్లకార్డులతో నినాదాలు చేశారు. ఈ కార్యక్రమం "" తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించగా అధ్యక్షుడు మల్లారెడ్డి, శంకర్రావు యాదవ్, ప్రధాన కార్యదర్శి నిమ్మల శ్రీనివాస్ సామాజికవేత్త, ఉపేందర్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, కేదారి, శ్రీలత రెడ్డి, మునగాల పద్మ, నరసింహా రాములు, మల్లిపెద్ది కృష్ణశాస్త్రి పాల్గొన్నారు.

# వృద్ధాశ్రమానికి కేటాయించిన భూమి సందర్శన



**వరంగల్ వాయిస్, ఎల్కతుర్తి :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ, జిల్లా సంక్షేమ అధికారి సంయుక్త ఆధ్వర్యంలో వృద్ధాశ్రమం నిర్వహించడానికి ఎల్కతుర్తి మండలం చింతలపల్లి గ్రామంలో ఒక ఎకరం భూమిని కలెక్టర్ కేటాయించారు. శనివారం ఈ భూమిని హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి.విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈవీ శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణు గోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, డాక్టర్ మాగంటి శేషుమాదవ్, జిల్లా సంక్షేమ అధికారి జి. లక్ష్మి కాంత రెడ్డి సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా పాలకవర్గం మాట్లాడుతూ అతి త్వరలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ, జిల్లా సంక్షేమ అధికారి సంయుక్త ఆధ్వర్యంలో వృద్ధాశ్రమం నెలకొల్పబడుతుందని వారు తెలిపారు.

# సీపీని కలిసిన వేలేరు ఎస్ఐ



**వరంగల్ వాయిస్, వేలేరు :** స్థానిక పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన అజ్మీరా సురేష్ శనివారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూను మర్యాద పూర్వకం కలుసుకొని మొక్క అందజేశారు.

# ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని లింగాపురం గ్రామంలో అంగన్వాడీ సెంటర్లలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీస్ సూపర్ వైజర్ రాధ మాట్లాడుతూ తల్లి పాలే పిల్లలకు శ్రేష్ఠమైనవని, తల్లి పాలు తీసుకోవడం వలన పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని, అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఆరు నెలలు తప్పకుండా తల్లి పాలు ఇవ్వాలన్నారు. ఆ పాలలో బిడ్డకు సరిపడే పోషకాలు వ్యాధి నిరోధకాలు పుష్కళంగా ఉండి శిశువు పొట్టను శుభ్రంగా ఉంచుతాయని తెలిపారు. భవిష్యత్ లో దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా సహాయపడుతాయని, పిల్లలకు పాలు ఇవ్వడం ద్వారా తల్లులకు రొమ్ము కాన్సర్ రాకుండా ఉండే అవకాశంతో పాటు మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ సువార్త, ఎంపీపీస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ భాస్కర్, హైస్కూల్ టీచర్స్ జయశ్రీ, పద్మ ఏఎన్ఏం శ్వేత, అంగన్వాడీ టీచర్స్ ఊర్మిళ, హేమలత, ఆశా వర్కర్స్ సంధ్య, అరుణ, ఆయాలు తేజ, శారద గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

### పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, సంగెం :** పరకాల నియోజకవర్గంలోని అనారోగ్యానికి గురై చికిత్స పొందిన సంగెం, ఖిలా వరంగల్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 51మంది లబ్ధిదారులకు రూ.16 లక్షల 65వేల రూపాయల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, 35 మంది లబ్ధిదారులకు రూ. 35 లక్షల 4వేల 60 రూపాయల విలువ గల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను శనివారం సంగెం మండల కేంద్రంలోని రైతు వేదికలో అధికారులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ పేదలకు కూడా కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందాలనే ఉద్దేశ్యంతో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ద్వారా సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి పేదవాడికి, పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తున్నారని అన్నారు. నిరుపేదలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ , కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి లబ్ధిదారుల తరపున ధన్యవాదాలు తెలిపారు. అలాగే, గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవేలో భూములు కోల్పోతున్న రైతులకు త్వరలో నష్టపరిహారం అందేలా కృషి చేస్తానన్నారు.

## స్వచ్ఛదనం-పచ్చదనం జయప్రదం చేయాలి

### కార్పొరేటర్ పల్లం పద్మా రవి



**వరంగ్ల వాయిస్, వరంగల్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం ఆగస్టు 5 నుంచి 9 వరకు జరుగుతుందని, అందులో ప్రజలందరూ పాల్గొనాలని 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మా రవి కోరారు. డివిజన్ లోని కమిటీలు, ఆశాలు, ఆర్పీలు, అంగన్వాడీలు, శానిటేషన్ సిబ్బంది, డివిజన్ నాయకులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు స్పెషల్ ఆఫీసర్ ముజామిల్, వార్డు ఆఫీసర్ రాజేశ్వరి, హెల్త్ ఆఫీసర్ మోహన్ రావు, జవాన్ ఓరుగంటి జీవన్, అంగన్వాడీలు, ఆర్పీలు, ఆశాలు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, ములుగు :** మండలంలోని జాకారం గ్రామానికి చెందిన మంచోజు అక్షిత శనివారం మృతి చెందింది. కాగా, ఈ విషయం తెలుసుకున్న ములుగు జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బాదం ప్రవీణ్ జాకారం చేరుకొని అక్షిత మృతదేహనికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా మంచోజు అక్షిత మృతికి గల కారణాలు అడిగి తెలుసుకొవడంతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాదం ప్రవీణ్ వెంట కాంగ్రెస్ జాకారం గ్రామ కమిటీ అధ్యక్షుడు లాల్ పాషా, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

## విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి



**వరంగల్ వాయిస్, మరిపెడ :** విద్యుదాఘాతంతో పాడి గేదే మృతి చెందిన సంఘటన మండలంలోని వీరారం శివారు బాల్యతండా గ్రామపంచాయతీ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండడంతో మేతకు వెళ్లిన గేదెకు కరెంటు వైర్లు తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. సుమారు ఎనభైవేల రూపాయల విలువచేసే పాడిగేదె మృతి చెందడంతో బాధిత రైతు బోడ అమర్ సింగ్ కన్నీటి పర్యంతమయ్యారు. విద్యుత్ అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నగానీ, ట్రాన్స్ పార్మర్ వైర్లను సరి చేయలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిరుపేద రైతుకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వారు కోరారు.

## పుట్టిన ఊరంటే ఎంతో ఇష్టం, మమకారం

### రావుల విజిత రవిచందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, కేసముద్రం :** పుట్టిన ఊరంటే తనకు ఎంతో ఇష్టం.. తెలియని ప్రేమ అని తాళ్లపూసపల్లి మాజీ సర్పంచ్ రావుల విజిత రవిచందర్ రెడ్డి అన్నారు. శనివారం గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్, వార్డుసభ్యులకు పదవీవిరమణ సన్మాన కార్యక్రమం జరగగా అధికారులు, ప్రజాప్రతినిధులు వారికి జ్ఞాపికలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో సర్పంచ్ రావుల విజితరవిచందర్ రెడ్డి మాట్లాడారు. ఊరికి సేవ చేయడం కోసం సర్పంచ్ పదవి చేపట్టి ఐదేళ్లకాలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టమని తెలిపారు. తన పదవీకాలంలో గ్రామ అభివృద్ధి కోసం వార్డుసభ్యులు, అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది ఎంతో సహకరించారన్నారు. అదేవిధంగా రెడ్ క్రాస్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ, పాఠశాలలకు బెంచీల వితరణ, విద్యార్థులకు నోట్ బుక్కులు, ఇతర వస్తువులు అందజేసినట్లు ఆమె పేర్కొన్నారు. గ్రామాభివృద్ధిలో భాగంగా తల్లిదండ్రుల పేరుపై 20 గుంటల భూమిని జడ్పీ హైస్కూల్ కోసం దానం చేసినట్లు తెలిపారు. గ్రామంలో విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేశామన్నారు. నూతనంగా విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు చేయించి నిర్మాణాన్ని పూర్తి చేయించినట్లు చెప్పారు. సొంత గ్రామం అంటే తనకు వినలేని మమకారం అని అన్నారు. పదవి ఉన్న లేకున్నా గ్రామ అభివృద్ధి కోసం తాను ఎల్లవేళలా సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రావుల నవీన్ రెడ్డి, హైస్కూల్ హెచ్ఎం కోట కనకయ్య, కమిటీ సభ్యులు గొర్రె వెంకన్న, సభ్యులు ఆకుల సోమయ్య, గ్రామ స్పెషల్ ఆఫీసర్ కనకయ్య, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రమీల, స్కూల్ ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి కోల దర్గయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ చట్టంపై అవగాహన కలిగి ఉండాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** నూతన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు లో 'న్యాయ అక్షరాస్యత శిబిరం' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు జడ్జి, ఏ.ఓ చిన్నగూడూర్, చిన్నగూడూర్ ఎస్ఐ ఝాన్సీ పాల్గొన్నారు. ఇందులో ముఖ్యంగా నూతన చట్టాలు, రైతు సంక్షేమ పథకాలు లాభాలు, వినియోగదరుల చట్టాలు, పలు అంశాలు, నకిలీ విత్తనాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మహిళా రక్షణ లాంటి అంశాలు, ప్రాథమిక స్థాయి చట్టాన్ని తెలుసుకోవడం ద్వారా అన్యాయాలను మరింత సమర్థవంతంగా గుర్తించి సవాలు చేయవచ్చని, అదేవిధంగా, ఒక వ్యక్తి వారి అస్థిరమైన భావోద్వేగాలు, ఇతరులతో విభేదాల కారణంగా విభేదాలలో పాల్గొనడం ద్వారా అతని లేదా ఆమె మనశ్శాంతిని కోల్పోకూడదు. అటువంటి అవకాశం ఉన్న చోట ఇరుపక్షాల మధ్య రాజీ ద్వారా కేసులను పరిష్కరించవచ్చని, పిటిషనర్లు కోర్టుల చుట్టూ తిరుగుతూ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా రాజీమార్గం ద్వారా కేసు పరిష్కారానికి ప్రయత్నించాలన్నారు. వ్యక్తులు తమ తల్లిదండ్రులను గౌరవించాలని, మానవతా విలువలను కాపాడుకోవాలని, ఆస్తి కోసం తల్లిదండ్రులకు దూరం కాకూడదని న్యాయమూర్తులు పేర్కొన్నారు. వృద్ధులైన తల్లిదండ్రులను అనాథాశ్రమాలకు పంపడం వల్ల భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు ఎదురయ్యే ప్రమాదం ఉందని గ్రహించాలని, చిన్నతనంలో చేసే చిన్న చిన్న పొరపాట్లు కోలుకోలేని పరిస్థితులకు దారితీస్తాయని, వారి పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ, పలు అంశాలు చర్చించారు.

## ఆరు గ్యారంటీల అమలుకు దశల వారి ఆందోళనలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలనే డిమాండ్ తో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కమిటీ దశల వారి ఆందోళనకు పిలుపునిచ్చిందని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాప్రంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో రాష్ట్ర కమిటీ ముద్రించిన కరపత్రాలు శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ముఖ్యమైన ఆరు గ్యారంటీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన నిర్లక్ష్యాన్ని వహిస్తుందని మండిపడ్డారు. పార్టీ ఫిరాయింపుల కోసం గత పాలకులపై తీవ్ర విమర్శలు చేయడం కోసం కాలాన్ని వృథా చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యంగా గత 12 సంవత్సరాలుగా రేషన్ కార్డులు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, దాని ఆధారంగా రావలసిన సంక్షేమ సబ్సిడీలను కోల్పోతున్నారన్నారు. రైతు రుణమాఫీలో అనేక లోపాలు ఉండి రెండు విడతలలో కూడా అర్హులైన వారికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. పెట్టుబడి సహాయం వెంటనే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారానికి ఆగస్టు 8న జిల్లా కలెక్టరేట్ల ముట్టడి, ఆగస్టు 21న చలో హైదరాబాద్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయా వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ మహబూబాబాద్ డివిజన్ సహాయ కార్యదర్శి బిల్లా కంటి సూర్యం, కేసముద్రం సంయుక్త మండలాల కార్యదర్శి భాస్కర్ రెడ్డి, సహాయ కార్యదర్శి ఫైండ్ల యాకయ్య, పీవైఎల్ నాయకులు సురేందర్ రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్ అందజేత



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో దేవులపల్లి సాంబశివరావు శతజయంతిని పురస్కరించుకొని వారి కుటుంబ సభ్యులు విద్యార్థిని విద్యార్థులకు మిఠాయి పంపిణీ చేశారు. ప్రాథమిక పాఠశాలకు రూ.30 వేలపై చిలుకు విలువచేసే వాటర్ ప్యూరిఫైయర్ జల వితరణ ఇవ్వడం జరిగింది. అలాగే జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు రూ.8000 విలువచేసే కరెంటు ఎర్త్ ఫిట్టింగ్ చేయించారు. ఈ కార్యక్రమంలో వారి పెద్ద కొడుకు శివప్రసాద్ మాట్లాడుతూ మా తండ్రి చాలా సంవత్సరాలు శాయంపేట పాఠశాలలో పనిచేశారని తెలియజేశారు. కూతురు మాట్లాడుతూ మా తండ్రి వృత్తి నిబద్ధత పేద పిల్లలకు అండగా ఉంటూ వృత్తిని దైవంగా భావించారని తెలిపారు. దేవులపల్లి సాంబశివరావు శాయంపేట పాఠశాలలో 1952 నుంచి 1958 వరకు ఉపాధ్యాయుడిగా పని చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులందరితో పాటు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలగంగాధర్ రాజు, బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం లతా రెడ్డి, పాఠశాలల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, పాఠశాలల చైర్మన్ తుమ్మ లావణ్య, మామిడి తిరుపతమ్మ, మాజీ ఎస్ఎంసీ చైర్ పర్సన్ వలుపదాసు వెంకటరమణ, వైస్ చైర్మన్ గాదె శ్రీలత రఘు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వరంగల్ మహానగర అభివృద్ధికి మరో పోరాటం

## హనుమకొండ, వరంగల్ జిల్లాలను ఏకం చేయాలి

**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** పరిపాలన సౌలభ్యం పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చారిత్రక వరంగల్ జిల్లాను ఇష్టారాజ్యంగా ఆరు ముక్కలు చేసి ఆరు జిల్లాలను చేసి ఈ ప్రాంత ప్రజలకు తీరని అన్యాయం చేసి అభివృద్ధిలో వెనుకబడేశారని వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రముఖులు విమర్శించారు. శనివారం హనుమకొండ జిల్లా కేంద్రం ప్రెస్ క్లబ్ లో వరంగల్ మహానగర పునఃనిర్మాణం, పరిపాలన సౌలభ్యం-అభివృద్ధిపై ముప్పిడి సంపత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన చర్చా గోష్ఠిలో నగర ప్రముఖులు ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, మాజీ మేయర్ టి.రాజేశ్వర్ రావు, సీనియర్ న్యాయవాది, తెలంగాణ ఉద్యమకారులు ముద్ధసాని సహోదర రెడ్డి, గుడిమల్ల రవికుమార్, ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షులు పుల్లూరు సుధాకర్, సోమ రామమూర్తి, సాయిని నరేందర్, చిల్ల రాజేంద్ర ప్రసాద్, కర్ర యాదవ రెడ్డి, కొంద్ర నర్సింగరావులు పాల్గొని మాట్లాడారు. గత కేసీఆర్ పాలనలో పరిపాలన సౌలభ్యం పేరుతో చారిత్రక నగరాన్ని ఆరు ముక్కలుగా విచ్ఛిన్నం చేసి అస్తవ్యస్తంగా జిల్లాలు ఏర్పాటు చేసి ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణ ఉద్యమ నాయకత్వాన్ని, రాజకీయ చైతన్యాన్ని దెబ్బదీశారన్నారు. గత పాలకులు చేసిన ద్రోహాన్ని ప్రస్తుత పాలకులు సమీక్షించి వరంగల్, హనుమకొండ జిల్లాలను ఏకం చేసి అభివృద్ధి చేయాలన్నారు. ఉత్తర తెలంగాణలో వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కేంద్రమైన వరంగల్, ఉత్తర తెలంగాణకు విద్యా కేంద్రమైన హనుమకొండ, దక్షిణ భారత దేశానికి రైల్వే కేంద్రమైన త్రినగరమైన వరంగల్ మహా నగరాన్ని ఏకం చేయడం ద్వారానే అభివృద్ధి జరుగుతుందని వారు అభిప్రాయపడ్డారు. నగరమంటే పారిశ్రామిక ప్రాతినిధ్యం కలిగి ఉండాలని, పాలనా సౌలభ్యం అంటే ప్రజలకు జీవన అవసరాలను మెరుగుపరచేదిగా ఉండాలని అందుకు భిన్నంగా రాజకీయ, వ్యాపార వర్గాల మేలు కోసం జిల్లాలను ఏర్పాటు చేసి మహానగరాన్ని విభజించారని మండిపడ్డారు. దక్షిణ భారత దేశాన్ని ఏలిన వరంగల్ కేంద్రాన్ని చారిత్రిక ఆనవాళ్లు లేకుండా చేయడమే కాకుండా అభివృద్ధిలో హనుమకొండ



30 స్థానంలో ఉందని, పాత జిల్లాల కేంద్రాలు అభివృద్ధి కేంద్రాలుగా ఉండేవని, కొత్త జిల్లాలతో ఆ అభివృద్ధి కుంటుపడిందని అన్నారు. మహా నగరాలకు రావల్సిన జాతీయ స్థాయి నిధులు, సంస్థలు రాక పోవడం వల్ల వరంగల్ మహానగర అభివృద్ధి వెనుకబడిపోతుందన్నారు. తెలంగాణలో ప్రజలు ఒక్క హైదరాబాద్ మహా నగరానికే తరలిపోయి బతుకుతున్నారని, ఉత్తర తెలంగాణ కేంద్రమైన వరంగల్ మహానగరాన్ని అభివృద్ధి చేస్తే రాష్ట్రం లోని సగభాగం ప్రజలకు ఉపాధి కేంద్రంగా మారుతుందని అన్నారు. పోరాటాలకు కేంద్రమైన వరంగల్ వరంగల్ మహానగరాన్ని కాపాడుకోవడానికి మరో పోరాటం చేయాల్సిన అవసరముందని, అందుకోసం రెండు జిల్లాల్లోని వివిధ రంగాలకు చెందిన వారిని ఏకం చేసి ప్రస్తుత ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇవ్వడమే కాకుండా రెండు జిల్లాల ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కూడా కలిసి వివరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, డాక్టర్ అశోక్ రెడ్డి, న్యాయవాదులు చిల్ల రాజేంద్ర ప్రసాద్, కూనూరు రంజిత్ గౌడ్, రాచకొండ ప్రవీణ్ కుమార్, రాజ్ మహ్మద్, ఇతం నగేష్, నలిగింటి చంద్రమౌళి, దారం జనార్ధన్, డాక్టర్ గిరిజారాణి, సింగారపు అరుణ, అడ్లూరి పద్మ, కొంద్ర నర్సింగరావు, పల్లపు సమ్మయ్య, మండల పరుషరాములు, మంద వీరాస్వామి, సంగాని మల్లేశ్వర్, సారంపెల్లి వాసుదేవ రెడ్డి, సోమిడి శ్రీనివాస్, బొట్ల చక్రపాణి, కొంగ వీరాస్వామి, నున్న అప్పారావు, బాబురావు, తాడిశెట్టి క్రాంతి కుమార్, కేడల ప్రసాద్, సూర్యనారాయణ, బుచ్చిరెడ్డి, ఓదెల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుడికి ఆర్థిక చేయూత



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని పత్తిపాక గ్రామంలో జడ్పీహెచ్ఎస్ 2003-04లో పదవ తరగతి చదువుకున్న చిన్ననాటి మిత్రుడు పల్లెబోయిన కర్ణాకర్ తండ్రి పల్లెబోయిన సాయిలు మృతిచెందారు. విషయం తెలుసుకున్న తోటి మిత్రులు మానవత దృక్పకంతో మిత్రులందరూ కలిసి రూ. 20వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వేణు, శ్రీనివాస్, సుమన్, శివాజీ, ప్రవీణ్, పరిపూర్ణచారి, ప్రశాంత్, తిరుపతి, మహేందర్ మిత్రులు పాల్గొన్నారు.

## సీసీ, సీఏలను తొలగించాలి

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చింత నెక్కొండ గ్రామంలోని ఆదర్శ మహిళ పొదుపు సంఘం లీడర్లను పక్కనపెట్టి సంఘంలోని నలుగురు సభ్యులతో సీసీ సుధాకర్, సీఏ రాజయ్య ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని లీడర్లు తౌడోజు సువర్ణ, మదూరు లక్ష్మి ఆరోపించారు. సీఏ రాజయ్య లీడర్ల ప్రమేయం లేకుండానే మిగతా సభ్యులతో కలిసి వీరిపై కక్షతో చిట్టి నడిపించుకుంటూ బెదిరింపులకు గురి చేస్తూ మీకు



ఎలాంటి లోన్లు ఇప్పించనంటూ ఇబ్బందులు పెడుతున్నారు. దీనికి సీసీ సుధాకర్ కూడా రాజయ్యకు వంత పాడుతున్నాడని వాపోయారు. సంఘంలోని డబ్బులను ఇష్టారాజ్యాంగ వాడుకుంటున్నారని, అడిగితే మీరు గ్రూపులో ఉంటే ఉండండి లేకపోతే వేరే గ్రూపులోకి వెళ్లండని దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘంలో అప్పులు కావాలంటే మాకు ఇవ్వడం లేదని, వీరిద్దరిపై చర్యలు తీసుకుని వీరిని తొలగించాలని వారు కోరారు.

## గుడుంబా స్థావారాలపై దాడులు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా ఎస్పీ సుధీర్ రంనాధ్ కేకన్ ఆదేశాలతో పోలీసులు మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా గుడుంబా స్థావారాలపై దాడులు నిర్వహించారు. 272 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని, 50 కేజీల నల్ల బెల్లం, 8330 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. గుడుంబాను తయారు చేస్తున్న 29 మంది వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, గుడుంబాను తయారు చేస్తే పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం గుడుంబా సేవిస్తే వచ్చే నష్టాలపై పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు.

## తల్లిపాలు బిడ్డకు మేలు



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని నర్సక్కపల్లె గ్రామంలో అంబేద్కర్ కాలనీ అంగన్వాడీ కేంద్రం-2 సెంటర్ పరిధిలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా శనివారం అంగన్వాడి టీచర్ కోడెపాక సుప్రియ ఆధ్వర్యంలో అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరునెలలు నిండిన పిల్లలకు అనుబంధ పోషకాహారాన్ని మొదలు పెట్టడం జరిగిందని, తల్లిపాల ప్రాముఖ్యతను, ముర్రు పాల విశిష్టతను గురించి వివరించారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, వేరే ఇతర పానీయాలు ఇవ్వకూడదని చెప్పారు. అన్నప్రాసన జరిగిన పిల్లలకు బౌల్స్ బహుమతి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఆయామ్మ జన్ను వనజ, గర్భిణీలు, బాలింతలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

### టౌన్ డీఎస్పీ తిరుపతి రావు




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** స్థానిక గాదె రుక్మారెడ్డి మెమోరియల్ హైస్కూల్ లో జరిగిన షీటీం, సైబర్, భరోసా ఆధ్వర్యంలో అవగాహన సదస్సులో టౌన్ డీఎస్పీ తిరుపతి రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సైబర్ నేరగాళ్లు విషయంలో జాగ్రత్తగా వుండాలని సూచించారు. అదేవిధంగా అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని, విద్యార్దులు సెల్ ఫోన్ ఓటీపీలకు రెస్పాండ్ కావొద్దని, బాలికలు వ్యక్తిగత సమస్యలను షీటీంను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ రీనా గోపికృష్ణ, రజిత్, మాధవ్, కమ్మగాని కృష్ణమూర్తి, క్రైమ్ బ్రాంచ్ సీఐ వెంకటేశ్వర్లు, షీటీం ఎస్సై సునంద, ఆనందం, అరుణ, సాహిత్య, సుప్రజ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉచిత మధుమేహ, కంటి నిర్ధారణ పరీక్షలు




**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని పత్తిపాక గ్రామంలో శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ వారి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు, పాఠశాల విద్యార్థులకు ఉచిత మధుమేహ, కంటి పరీక్షలు, బీపీ షుగర్ నిర్ధారణ చేశారు. పరీక్షలు జరిపిన అనంతరం ఎవరికైనా అనారోగ్య సమస్య ఉంటే అందుబాటులో ఉన్న హాస్పిటల్ కి వెళ్లి వైద్యుడికి చూపించుకోవాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి గ్రామాలలో ఉచిత పరీక్ష శిబిరం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కే.నిర్మల, సెక్రటరీ కే.ప్రభాకర్, ట్రెజరర్ కిరణ్మయి, జిల్లా లియో చైర్ పర్సన్ సుభాష్, జాయింట్ ట్రెజరర్ మోహన్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా గెలిపించండి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ కాంగ్రెస్ యూత్ ఎన్నికల్లో వరంగల్ అర్బన్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా తాను పోటీచేస్తున్నట్లు కేఆర్.దిలీప్ రాజ్ తెలిపారు. కాబట్టి, 18-35 లోపు యువతీ, యువకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అత్యధికంగా భారీ మెజార్టీతో జిల్లా యూత్ అధ్యక్షుడిగా తనను గెలిపించాలని కోరారు.

## స్వచ్ఛదనం- పచ్చదనంపై అవగాహన



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం స్వచ్ఛదనం- పచ్చదనంపై అవగాహన కార్యక్రమం రెండో డివిజన్ లోని స్థానిక కార్పొరేటర్ లావుడియా రవి నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రవి నాయక్ మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి 9 వరకు జరిగే స్వచ్ఛదనం- పచ్చదనంపై రోజువారీ కార్యక్రమం గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ప్రశాంతి, వార్డు ఆఫీసర్, ఆర్పీలు, మహిళా సంఘాలు, యూత్ సంఘాల అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, సానిటరీ జవాన్లు పాల్గొన్నారు.






## ఓటీటీలోకి ప్రియదర్శి.. డార్లింగ్

ప్రియదర్శి, నభా నటేష్ లీడ్ రోల్స్‌లో నటించిన యూనిక్ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'డార్లింగ్'. జూలై 19న ప్రపంచ వ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం మిశ్రమ స్పందనను తెచ్చుకుంది. ఇప్పుడు ఈ మూవీ డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. కథ విషయానికి వస్తే.. ఒక ట్రావెల్ ఏజెన్సీలో పని చేసే రాఘవకు పెళ్లి చేసుకొని హనీమూన్‌కు పారిస్ వెళ్లాలని కలలు కంటూ ఉంటాడు. ఈక్రమంలో ఒకటి రెండు సంబంధాలు పెళ్లి వరకు వచ్చి డిప్రెషన్‌లోకి వెళతాడు. అలాంటి సమయంలో ఆనంది (నభ నటేష్) పరిచయం అవడం, వివాహం చేసుకోవడం జరిగి పోతాయి. తీరా అసలువిషయం అప్పుడే మొదలవుతుంది. ఆనందికి మల్టిపుల్ పర్సనాలిటీ డిజార్డర్ అనే వ్యాధి ఉన్నట్లు తెలుస్తుంది. దీంతో ఆమె ఏ నిమిషం ఎలా ఉంటుంది, ఎలా ప్రవర్తిస్తుందనే విషయం అసలు అంతుచిక్కదు. ఈ నేపథ్యంలో రాఘవ ఆనందితో ఎలా కాపురం చేశాడు, హనీమూన్ కల తీరిందా లేక ఇద్దరూ విడిపోయారా? అసలు ఆనంది ఎవరు, ఆమె నేపథ్యం ఏంటి? ఆమె గతం గురించి తెలిసిన రాఘవ చివరికి ఏమి చేశాడు? అనే ఆసక్తికరమైన కథకథనాల చుట్టూ సినిమా సాగుతూ నవ్వులు పూయిస్తుంది. ఇప్పుడు ఈ చిత్రాన్ని నెల రోజులలోనే ఈ నెల 13వ తేదీ నుంచి డిస్నీ ప్లస్ హాట్ స్టార్ ఓటీటీలో స్ట్రీమింగ్‌కు తీసుకు వస్తున్నారు. సో ఎవరైతే థియేటర్లలో మిస్సయ్యారో ఇక ఇంట్లోనే కుటుంబంతో కలిసి చూసి ఆనందించండి.

## ఈ ప్రశ్నను మాత్రమే ఎందుకు అడుగుతారు.

### మా రెమ్యూనరేషన్ కాదు.. హీరోలను అడగండి

బాలీవుడ్ అగ్ర నటులు అజయ్ దేవగణ్, టబు ప్రధాన పాత్రల్లో నటించిన ప్రేమకథా చిత్రం 'ఔర్ మే కహా దమ్ థా'. ఈ సినిమాకు నీరజ్ పాండే దర్శకత్వం వహించగా.. శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే రీసెంట్‌గా ఈ సినిమా ప్రమోషన్‌లో పాల్గోన్న టబు పారితోషికం వ్యత్యాసాలపై గట్టిగా స్పందించింది. ఈ ప్రమోషన్స్‌లో భాగంగా ఒక రిపోర్టర్ ఈ సినిమాకు మీ రెమ్యూనరేషన్ ఎంత అని అడుగుతాడు. దీనిపై స్పందించిన టబు ప్రతిసారి ఈ ప్రశ్నను హీరోయినులను మాత్రామే ఎందుకు అడుగుతారు. నిర్మాతలను అడగవచ్చు కదా! అలాగే మీకు మాత్రమే ఎందుకు ఎక్కువ రెమ్యూనరేషన్ ఇస్తున్నారు అంటూ హీరోలను కూడా అడగవచ్చు కదా? ఇలా మీరు అడిగితే ఇలాంటి విషయంలో ఎన్నో మార్పులు వస్తాయి అని టబు తెలిపారు. రీసెంట్‌గా బాలీవుడ్‌లో క్రూ అనే సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకుంది ఈ భామ. కరీనా కపూర్, టబు, కృతి సనన్ ప్రధాన పాత్రల్లో వచ్చిన ఈ చిత్రం రూ.100 కోట్ల వసుళ్లను రాబట్టింది. మరోవైపు ఇప్పటికే అజయ్‌తో కలిసి టబు హిందీ 'దృశ్యం'తో పాటు దే దే ప్యార్ దే సినిమాలో నటించారు. ఇక 'ఔర్ మే కహా దమ్ థా' చిత్రంలో వీరి కాంబో రిపీట్ అవుతుండడంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. చిన్న వయసు నుంచే ఇష్టాన్ని పెంచుకున్న కృష్ణ(అజయ్), వసుధ (టబు)లు ఒకరంటే ఒకరికి ప్రాణం ఉండి ఎందుకు విడిపోయారు? మళ్లీ తిరిగి కలిశారా? లేదా? విడిపోయిన తర్వాత వారి జీవితాల్లో వచ్చిన మార్పులు ఏమిటి? అనే ఆసక్తికర అంశాలతో ఈ చిత్రం తెరకెక్కింది.

## సూర్య కంగువాతో పోటీపడలేరు

శివ దర్శకత్వంలో సూర్య ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'కంగువా' రెండు భాగాలుగా ఇది రానుంది. ఫాంటసీ యాక్షన్ ఫిల్మ్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా కోసం సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ చిత్ర నిర్మాత ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. సినిమాపై అంచనాలను పెంచారు.అక్టోబర్ 10న ఈ చిత్రం విడుదల కానున్న విషయం తెలిసిందే. ఇదే తేదీన మరికొన్ని చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. ఈ పోటీపై నిర్మాత కేఈ జ్ఞానవేల్ మాట్లాడుతూ.. 'కంగువ' కంటెంట్ గురించి తెలియదు కాబట్టి.. దీని మొదటి భాగం వచ్చే తేదీకి మరికొన్ని సినిమాలు విడుదలయ్యే అవకాశం ఉంది. కానీ, 'కంగువ2'తో మాత్రం ఎవ్వరూ పోటీకి రాలేరు. ఈ విషయాన్ని నమ్మకంతో చెబుతున్నాను. సినిమా కంటెంట్ అంత బలమైనది' అని చెప్పారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. గతంలోనూ నిర్మాత సినిమా ఫలితంపై ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. రూ.1000 కోట్లు సాధించడమే లక్ష్యమన్నారు.



సీక్వెల్‌కు కథ సిద్ధంగా ఉందన్నారు. పార్ట్ 1 విజయం ఆధారంగా సీక్వెల్ ఎలాన్ చేయనున్నట్లు తెలిపారు. ఈ సినిమా సూర్యని మరో స్థాయికి తీసుకెళ్తుందని నమ్ముతున్నట్లు చెప్పారు. యాక్షన్‌తోపాటు ఎమోషన్స్‌కు ఇందులో అధిక ప్రాధాన్యం ఉందన్నారు.



## కష్టాలను నవ్వుతూ ఎదుర్కోవాలి




### నవీన్ పోలిశెట్టి తాజా వీడియో విడుదల

జాతిరత్నాలు ఫేమ్ హీరో నవీన్ పొలిశెట్టికి ఇటీవలే అమెరికాలో యాక్సిడెంట్ జరిగిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో ఆయన చేతికి, కాలికి ఫ్రాక్చర్ అయింది. తనకు జరిగిన ప్రమాదంపై, తాను ఉన్న పరిస్థితిపై తన ఫ్యాన్స్ కోసం ఇటీవలే సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టాడు. ఈ నేపథ్యంలో జరిగిన ప్రమాదం నుంచి..కోలుకునే పక్రియ కాస్త నెమ్మదిగా సాగుతోందని నవీన్ పోలిశెట్టి వెల్లడించారు. తాజాగా నవీన్ పొలిశెట్టి అభిమానుల కోసం చేతికి కట్టుతో ఉన్న కొత్త వీడియోను షేర్ చేశాడు. 'లైఫ్ ఒక జిందగీ అయిపోయింది..త్వరలో కలుద్దాం జానే జిగర్స్' అంటూ క్యాప్షన్ తో ప్రస్తుత హెల్త్ అప్‌డేట్ ఇచ్చారు. 'సింగిల్ హ్యాండ్ గణెళిశ్' అంటూ వెంకటేశ్ చెప్పిన డైలాగు..'చెయ్యి చూశావా ఎంత రఫ్‌గా ఉందో' అని చిరంజీవి చెప్పిన డైలాగులను టీవీలో పెట్టుకొని తనను తానే ట్రోల్ చేసుకుంటూ నవ్వులు పూయించారు. అలాగే మరికొన్ని మీమ్స్ తో ఫ్యాన్స్ ను నవ్వించే ప్రయత్నం చేస్తూనే ప్రస్తుతం తాను పడే కష్టాన్ని చూపెట్టాడు. ఇక చివర్లో 'జీవితంలో వచ్చిన కష్టాలను నవ్వుతూ ఎదుర్కోవాలి. 'హాస్యమే మనకు ధైర్యాన్నిస్తుంది. మీ అందరినీ నవ్వించడం నాకెంతో ఇష్టం. పూర్తిగా కోలుకున్న తర్వాత బిగ్ స్క్రీన్‌పై మీ అందరినీ కలుస్తాను' అని వీడియోలో రాసుకొచ్చారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. ప్రస్తుతం ఒకరాజు అనే సినిమా చేస్తున్నారు నవీన్. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాలో లేటెస్ట్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్ గా నటిస్తున్నారు. ఈ సినిమా కాకుండా మరో రెండు క్రేజీ సినిమాలను కూడా లైన్లో పెట్టాడు నవీన్ పోలిశెట్టి.





# అభివృద్ధే మా ఎజెండా

**ఎంపీ డాక్టర్ కడియం కావ్య**

**భూపాలపల్లిలో పలు పనులకు శంకుస్థాపన**

**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** అభివృద్దే కాంగ్రెస్ పార్టీ ఎజెండా అని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఘన్ పూర్ మండలం పరిధిలోని మైలారం గ్రామంలో ఇండస్ట్రియల్ పార్కు అభివృద్ధి నిర్మాణ పనులకు మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ రావు, కేఆర్ నాగరాజులతో కలసి కడియం కావ్య గారు శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్ని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కావ్య మాట్లాడుతూ.. భూపాలపల్లి నియోజకవర్గన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని ప్రకటించారు. ఈ రోజు మైలారం గ్రామంలో ఇండస్ట్రియల్ పార్కు అభివృద్ధి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అన్నారు. భూపాలపల్లిలో ఖనిజ సంపద, నీటి వనరులు, అడవులు సమృద్ధిగా ఉన్నాయని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని పేర్కొన్నారు. భూపాలపల్లి హైవేలో ఇండస్ట్రియల్ కారిడార్ తెచ్చేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. అందుకు పార్లమెంట్ వేదికగా తన గళం వినిపిస్తానన్నారు. ఈ ప్రాంత అభివృద్ధితో పాటు ఇక్కడ ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు తన పూర్తి సహకారం అందిస్తానని ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటిన కడియం

**మోడల్ స్కూల్‌లో ఘనంగా వనమహోత్సవం**



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** రఘునాథ్ పల్లి మండలం వెల్ది గ్రామంలోని మోడల్ స్కూల్ లో వనమహోత్సవం కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా విచ్చేసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జీవకోటి మనుగడకు మొక్కలే ఆధారమని పేర్కొన్నారు. పర్యావరణ సంరక్షణకు, వర్షాలు సమృద్ధిగా కురువాలన్నా ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి రక్షించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఇష్టపడి చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. పాఠశాలల్లో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు విడుదల చేసిందని గుర్తు చేశారు. విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేయడానికి ఇబ్బందులు పడుతున్నందున త్వరలో డైనింగ్ హాల్ ఏర్పాటు చేయాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులకు సూచించారు. మోడల్ స్కూల్ ప్రధాన గేట్ నుంచి హాస్టల్ వరకు సీసీ రోడ్ నిర్మాణానికి మంజూరు ఇస్తామన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని మోడల్ స్కూల్ లో వారం రోజుల్లో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తానని తెలిపారు. పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు, గడ్డి పొదలను తొలగించాలని సూచించారు. పాఠశాల ఆవరణలో నాటిన మొక్కలను 7,8,9 వ తరగతి విద్యార్థులు అడాప్ట్ చేసుకొని రక్షించాలన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాలతో పోలిస్తే జనగామ జిల్లాలో గ్రీన్ కవరేజ్ తక్కువగా ఉందని, ప్రతి ఒక్కరూ సమాజిక బాధ్యతగా మొక్కలు నాటి వాటిని రక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గణితంలో అభ్యాసన సామర్థ్యాలు సాధించాలి

**క్వాలిటీ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ పెట్రోల్ పంప్ సమీపంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు దేవమణి అధ్యక్షతన శనివారం గణితంపై స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నేషనల్ అచీవ్ మెంట్ సర్వే-2024 కు సంసిద్ధమగుటకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమానికి హనుమకొండ క్వాలిటీ కంట్రోల్ కో-ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. అభ్యసన సామర్థ్యాలను, పిల్లల స్థాయిలను దృష్టిలో పెట్టుకొని బోధించాలని, వివిధ మాదిరి ప్రశ్న పత్రాలు ద్వారా పిల్లలకు తర్ఫీదు నివ్వాలని తెలియ జేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో తెలంగాణ గణిత ఫోరం రాష్ట్ర బాధ్యులు కందగట్ల సురేష్, కంది శ్రీనివాస్ రెడ్డి, టీఎంఎఫ్ జిల్లా బాధ్యులు బోయిని మహేష్, రిసోర్స్ పర్సన్ లు తౌటం భాస్కర్, పాశం రాజిరెడ్డి, హనుమకొండ, హసన్ పర్తి, ఐనవోలు మండలాల గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# రక్తదానం చేసిన వాకర్స్

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని భద్రకాళి బండ్ లో నిర్వహించిన రక్తదానంలో పలువురు వాకర్స్ చురుకుగా పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేయడం అందరి బాధ్యతగా గుర్తించాలని సూచించారు. రక్తదానం చేయడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని రక్షించిన వారమవుతామన్నారు. డాక్టర్ లయన్ గాండ్ల సురేష్ కుమార్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో బ్లడ్ డొనేట్ చేశారు. ఈ కార్యక్రమంలో పత్తిపాక సాంబశివుడు, దశరథం, సామల సురేష్, మనోహర్ గౌడ్, భిక్షపతి, వీరేశం, సురేష్, రవి, రమేష్, పాండు తదితరులు పాల్గొన్నారు



# డ్రైవర్ కుటుంబానికి నిమ్స్ డాక్టర్ అండ

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** గ్రామపంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ మంద కుమారస్వామి కుటుంబానికి నిమ్స్ అనుసంధాన అధికారి డాక్టర్ మార్త రమేష్ అండగా నిలిచారు. వారి కుటుంబానికి మనో ధైర్యం చెప్పి ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనారోగ్య కారణాలతో కుమారస్వామి ఇటీవల మృతి చెందగా విషయం తెలుసుకున్న మార్త రమేష్ శనివారం వారి కుటుంబ సభ్యులకు రూ.5వేల నగదుతోపాటు రూ.5వేల విలువ చేసే నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్త రవి, తిప్పారపు రవీందర్, దూకిరే రమేష్, ఏకంబ కమలాకర్, కారోబార్ శంకర్, ముదిగొండ శ్రీనివాస్, ఐలోని అభిషేక్, మంద రమేష్, మంద రాజు, మంద రాజేందర్, మంద బాబు, మంద రాములు, మంద భాస్కర్, మంద రాజేందర్, కొత్తపెల్లి భాస్కర్, గ్రామ పంచాయతీ సిబ్బంది రాయపూరి సాంబయ్య, జన్ను స్వామి, మంద సాంబయ్య, పులి బాబు, పులి రమేష్, మంద పద్మ, మంద రమ పాల్గొన్నారు.



# స్నేహం ఓ దివ్య ఔషధం

**రేపు (ఆగస్టు 4) స్నేహితుల దినోత్సవం**

స్నేహానికన్న మిన్నా..లోకాన లేదురా..అని ఏ..కవి పాట రాశాడో కానీ..మనసు పెట్టీ వింటుంటే తేనె కన్నా తీయగా ఉంటాయి ఆ పాట లోని మాటలు. స్నేహమనే మాటలో చెరో అక్షరం మనం అని కూడా అభివర్ణించారు. ఇలా స్నేహం మాధుర్యం పై కీర్తిస్తూ..చక్కటి పదాలతో అలంకరించి, చక్కెర (పంచదార) లో స్నేహం అనే పదాన్ని రాస్తే ఎంత బాగుంటుందన్న తియ, తీయని భావుకతను మదిలో ఆవిష్కృతం చేసేదే దోస్తానా. స్నేహం ఎంత అద్భుతం అని మనసులో మధుర భావన కల్గక మానదు. బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం ఇలా ఏ పరిక్రమలో నైనా కొండంత అండగా వెంట నిలుస్తోంది దోస్తి ఒక్కటే. అందుకే హిందీలో కూడా ఎంతో చక్కగా దోస్త్ మేరా దోస్త్ తూ హై మేరీ జాన్ అని వర్ణించారు. మైత్రి వల్ల కేవలం వ్యక్తులే కాదు, రాజకీయంగా వివిధ వ్యవస్థలు, దేశాలు కూడా ఎంతో పాజిటివ్ గా ఆలోచించి సానుకూల దృక్పథంతో చేతులు కలిపిన సందర్భాలు ఉన్నాయి. కలహం, జగడంతో సాధించేదేముంది, మైత్రి వల్లే ఎన్నో ప్రయోజనాలు సుమా అని పలు ఉదంతాలు చాటి చెప్పిన సందర్భాలు ఉన్నాయి. ఇక కళాశాలల్లో నైతే సోపతి వల్ల యువకుల్లో నాయకత్వ లక్షణాలు, ఆలోచనలో పరిణతి కలిగించే లాభదాయక అంశాలుగా వ్యక్తిత్వ వికాసానికి దోహద పడతాయి. సజ్జన సాంగత్యం అంత సులువుగా లభించదు. ఇక దుర్జన స్నేహం ఐతే కొన్ని పాఠాలు, గుణ పాఠమూ నేర్పిస్తుంది. బెస్ట్ ఫ్రెండ్ షిప్ వల్ల జీవితంలో ఉన్నత లక్ష్యం సాధించిన వాళ్ళూ ఉన్నారు. వ్యాపార రంగంలో కూడా ఫ్రెండ్స్ గా రాణించిన వాళ్లు ఉన్నారు. స్నేహ సుగంధం వల్ల జీవితంలో ఏమీ తెలియని అగమ్య గోచర పరిస్థితి నుంచి, నా స్నేహితుడు ఓ చక్కటి దిక్..సూచి అని పేర్కొనదగ్గ దోస్తులను ప్రాసాదిస్తుంది స్నేహం. యుక్త వయస్సుకు వచ్చిన అబ్బాయి, అమ్మాయితో తల్లి దండ్రులు గనక స్నేహితుల్లా ఉండగలిగితే?! ఇక చెప్పనే అక్కర లేదు ప్రతి విషయం అమ్మ తో, నాన్నతో పంచుకునే వెసులు బాటు పిల్లలకు కలుగుతుంది. మార్నింగ్ వాక్ సైతం ఎంతో మంది మిత్రులను పరిచయం చేస్తుంది. అవి ఇవి మాట్లాడించి మనసుకు హాయి కలిగిస్తుంది. ఏ..రా.. ఏం చేస్తున్నావ్.. అలా సెంటర్ దాక వెళ్లి వద్దాం పదా అంటూ భుజం తట్టి, నిస్తేజంగా ఉన్న ఫ్రెండ్ ను విశాల అంబరం కింద, విశాల ప్రపంచంలో తిరుగాడి..ఎన్నో ఊసులు పాలు పంచుకునేలా చేసేది కూడా స్నేహం అనే ఔషధమే. సో.. గొప్ప స్నేహితున్ని కలిగి ఉండటం కూడా ఓ అభారణమే. ప్రాణాల్ని సైతం కాపాడే అమృతమే స్నేహం.



**మాచన రఘునందన్**
సెల్ 9441252121
పౌర సరఫరాల శాఖ ఎన్ ఫోర్స్ మెంట్ డిప్యూటీ తాసిల్దార్
పొగాకు నియంత్రణ అంతర్జాతీయ అవార్డు గ్రహీత

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com